

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# మాతృదేవోభవ

రాత్రి తొమ్మిది గంటలు అయింది.

మాలతి లాన్‌లో గార్డెన్ చెయిర్‌లో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తోంది.

చలిగాలులు వీస్తున్నాయి. శాలువ నిండుగా కప్పుకుని అక్కడే కూర్చుంది. లోపలికి వెళ్ళాలని అనపించటం లేదు.

ఆ విషయం విన్నప్పట్నుంచీ నిలువెల్ల నీరసం ఆవహించింది. మనసు ఆలోచించటం మానేసి మొద్దుబారినట్లు అయిపోయింది.

ఇక ఏముందీ జీవితంలో? నిర్లిప్తంగా చివరి క్షణం కోసం ఎదురుచూస్తూ రోజులు గడపటమేనా?

కళ్ళు మూసుకుంటే ఏవేవోదృశ్యాలు స్పష్టా స్పష్టంగా మనసులో మెదులుతున్నాయి. ఎక్కడో దూరంగా పిడుగుపడిన దృశ్యం... ఎక్కడో మహా వృక్షాలు కూలిపోతున్న దృశ్యం... ఇంకెక్కడో చితిమంటలు రగులుతున్న దృశ్యం.

వాసుదేవరావు వచ్చి కుర్చీ దగ్గరకు లాక్కుని కూర్చున్నాడు.

"ఏమిటీ.. అక్కడ కూర్చున్నావు? " అని అడిగాడు. భార్య నుదుటి మీద చెయ్యివేసి చూశాడు.

"ఏం లేదు, ఇక్కడ కాస్త హాయిగా ఉంది. అందుకని.. ఇప్పటిదాకా టీవీ చూస్తూ కూర్చున్నాను. టీవీలోని నాటకాలు భగవంతుడు మన జీవితాలతో రచించిన నాటకాల ముందు వెల వెలా పోతున్నాయి..." అన్నది మాలతి వేదాంతిలా నవ్వుతూ...

"జీవితాలు నాటకాలు ఎలా అవుతాయి మాలతీ?" అని అడిగాడు వాసుదేవరావు.

"నాటకం జరుగుతున్న కాసేపూ అందులోని నటీనటులు పాత్రపోషణకు అనుగుణంగా నవ్వుతారు, ఏడుస్తారు.. కోపంతో అరుస్తారు, అలుగుతారు. భగవంతుడు ఆడించే నాటకంలోనూ ఇంతే.. భవిష్యత్తు ఏదో తన్ని తలకెత్తుతుందని ఆశలు పెట్టుకుంటాం. ఊహల పల్లకీ మీద విహరిస్తుంటాం. రోజులు గడిచే కొద్దీ ఈ భ్రమలు తొలిగిపోతాయి. మనసులో మంచుగడ్డలా ఘనీభవించిన ఆశలు ద్రవీభవించి, చప్పుడు చేయకుండా చెంపలమీద నుంచి కన్నీరుగా జారిపోతుంటాయి..." అన్నది మాలతి. ఆమె మాటల్లో వ్యక్తమైన వేదన, బాధ అతనికి అర్థమైంది.

"ఒక్కసారిగా ఇంత నైరాశ్యం, ఇంత వైరాగ్యం వచ్చిందేం.. మాలతీ నీకు?" అని అడిగాడు వాసుదేవరావు.

"వైరాగ్యం గాక ఇంకేం మిగిలింది చెప్పండి? సహృదయులైన మీలాంటి భర్తనీ, ఈ సిరిసంపదలనీ అందించినందుకు నేను భగవంతుడికి పూజలు చేసి కృతజ్ఞతలు తెలుపని రోజు అంటూ లేదు. కానీ ఆయన సుఖసంతోషాలను ఈ చేత్తో ఇచ్చినట్లే ఇచ్చి, ఆ చేత్తోనే లాగేసుకుంటాడని కలలోకూడా ఊహించలేదు.." అన్నది మాలతి గద్గదస్వరంతో...

"వెలుగు వెంట చీకటి, సుఖాలను అంటిపెట్టుకొని కష్టాలు ఉంటాయి. వాటిని విడదీయడం సాధ్యం కాదు. అయినా ఇప్పుడేమయిందని? నువ్వు తొందరలోనే కోలుకుంటావు. నీ కేం ఫర్వాలేదు.." అని ప్రేమగా భార్య తల నిమిరాడు వాసుదేవరావు.

భర్త చేతిని రెండు అరచేతుల్లోకి తీసుకుంది. దీర్ఘంగా నిట్టూర్చింది. ఒక్క క్షణం ఆగి నెమ్మదిగా అన్నది.

"నా గురించి నేను ఆలోచించటం లేదు. మీ గురించే ఆలోచిస్తున్నాను. నేను పోతే మీరు మళ్లీపెళ్లి చేసుకునేందుకు వీలుంటుంది కానీ నేను ఉన్నదాన్నీ కాదు, పోయినదాన్నీ కాదు, రోగాన పడి నేను మీకు గుదిబండలా తయారయ్యాను..."

మాలతి గర్భాశయంలో క్యాన్సర్ ఉన్నట్లు కనుగొన్నారు. అందుచేత ఆపరేషన్ చేసి యుటెరస్ తీసేయించాల్సి వచ్చింది. ఇంక మళ్ళీ మామూలు మనిషిగా తిరగలేనేమోనన్న భయం ఆమెను ఆవహించింది. పైగా ఇంక మాలతికి పిల్లలు కలిగే అవకాశం లేనందువల్ల, మరో పెళ్లి చేసుకోమని వాసుదేవరావుని అతని తల్లిదండ్రులు బలవంతం చేస్తున్నారు. తన కళ్ళముందే భర్త మళ్లీ పెళ్లి చేసుకుంటాడన్న భావన మాలతిని మానసికంగా చాలా కృంగదీస్తోంది.

"ఇంట్లో ఏదైనా ఒక వస్తువు చెడిపోతే బాగు చేయించుకుంటాం గానీ, దాన్ని బయట పారెయ్యం. కుక్కపిల్లకు జబ్బు చేసినా దాన్ని డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి రోగం నయం చేయిస్తాం కదా. అలాంటిది నిన్ను వదిలేసి మరో స్త్రీ వెంట పరుగులు తీస్తానని ఎలా అనుకున్నావు మాలతీ, నిన్ను ఏరికోరి వివాహం చేసుకున్నాను. మన పెళ్ళి అయిన ఏడేళ్ళ నుంచీ నాకు కొండంత అండగా నిలబడ్డావు. ఫిఫ్టీ ఫిఫ్టీ కాఫీ దగ్గరనుంచి కష్టసుఖాల దాకా అన్నిటినీ కలిసి పంచుకున్నాం. రోజూ ఇంట్లో అడుగుపెట్టేటప్పటికి నువ్వు నవ్వుతూ ఎదురు రాకపోతే నాకేమీ తోచదు. ఒక్కరోజు అయినా నిన్ను విడిచిపెట్టి ఉండలేను. నిన్ను ఎలా వదులుకుంటాను చెప్పు..." అన్నాడు వాసుదేవరావు.

"నాకు అన్నీ తెలుసు, మీ మనసు, మీ మనసులోని ఆలోచనలూ, అభిప్రాయాలూ మీ మంచితనం అన్నీ క్షుణ్ణంగా తెలుసు. అందుకనే నాకు అర్ధాయుష్షనే ఇచ్చినప్పటికీ ఈ కొద్దికాలంపాటైనా మీ భార్యగా మీతో కల్సి జీవించగలిగే అదృష్టాన్ని ప్రసాదించినందుకు ఆ భగవంతుడికి నేను ఎంతగానో రుణపడి ఉన్నాను.." అన్నది మాలతి.

"లేదు.. నీవు నిండుగా నూరేళ్ళూ బతుకుతావు నాకా నమ్మకం ఉంది..." అన్నాడు వాసుదేవరావు.

"నూరేళ్ళు వర్ధిల్లమని పెళ్లినాడు పెద్దలందరూ ఆశీర్వదించారు. కాపురానికొచ్చాక మీతో నూరేళ్ళు కాదు, వెయ్యేళ్ళు కల్సి జీవించాలని ఆశపడ్డాను. కానీ పట్టుమని పదేళ్ళు కూడా కాకముందే నా జీవితానికి గ్రహణం పట్టింది. మీరు చిన్నపిల్లాడికన్నా కనాకష్టం. అన్నీ నేను చూసుకోవాల్సిందే. రేపు నేను పోతే మిమ్మల్ని ఎవరు చూస్తారు?" అని అడిగింది మాలతి కలత చెందిన హృదయంతో...

"నీ కొచ్చిన ప్రమాదం ఏమీలేదు. నిన్ను ఎలాగైనా సరే బతికించుకుంటాను. అవసరమైతే అమెరికా తీసుకెళ్తాను.." అన్నాడు వాసుదేవరావు భార్యకు ధైర్యం చెబుతూ.

మాలతి వ్యధాభరితంగా నవ్వింది. "అమెరికాలో ఎవరూ చావరా? వాళ్ళు ఏమైనా అమృతం తాగుతారా? మృత్యువును జయిస్తారా? అమెరికాకు వద్దుగానీ, ఒక్కసారి తిరుపతికి తీసుకెళ్ళండి.. వచ్చే జన్మలో మళ్ళీ మిమ్మల్నే భర్తగా ఇవ్వమని ఏడుకొండలవాడ్ని వేడుకొంటాను..." అన్నదామె.

"తిరుపతి వెళ్ళటానికేం? అలాగే వెళ్దాం.. నీ జబ్బు తగ్గిపోతే కల్యాణం చేయిస్తానని మొక్కుకొన్నాను..." అన్నాడు వాసుదేవరావు.

అతని తల్లిదండ్రులు బాగా స్థితిమంతులు. స్వగ్రామంలో వంద ఎకరాల పొలం, లంకంత కొంప ఉన్నాయి. వాసుదేవరావు తండ్రి సీతారామయ్యగారు స్థానికంగా బాగా పలుకుబడిగలవారు. ఆ చుట్టుపక్కల ఆయన మాటకు తిరుగులేదు. సీతారామయ్యగారికి వాసుదేవరావు ఒక్కడే సంతానం కావటం వల్ల సహజంగానే వాళ్లు కొడుకు మీద పంచప్రాణాలు పెట్టుకున్నారు.

వాసుదేవరావు మాలతిని చూసి ఇష్టపడ్డాడు. ఆ అమ్మాయిని మొదటిసారి చూసినప్పుడు సరిగ్గా ఇలాంటి అమ్మాయి కోసమే తాను వెతుకుతున్నట్లు అనిపించింది. అతని దృష్టిని ఆ అమ్మాయి మీదనుంచీ ఎవరూ మళ్ళించలేకపోయారు.

వాసుదేవరావు కుటుంబం ఎంత సుసంపన్నమైనదో, మాలతి కుటుంబం అంత పేదరికంలో కొట్టుమిట్టాడుతోంది. మాలతి తల్లి వర్ధనమ్మ పాతకాలం మనిషి. పేదరికానికి, తోడు సంతానమూ ఎక్కువైనందువల్ల వర్ధనమ్మ ఆలోచనల్లో ఎప్పుడూ స్వార్థ చింతన తప్ప మరొకటి ఉండదు.

తల్లి కనబరిచే స్వార్థం, కక్కుర్తి మాలతికే నచ్చదు. ప్రపంచంలో మనకు నచ్చని ఏ విషయాన్ని అయినా మార్చుకోగలంగానీ, కన్న తల్లిదండ్రుల్ని మాత్రం మార్చుకోలేం. నచ్చినా, నచ్చకపోయినా తల్లిని తల్లిగా చెప్పుకోవాల్సిందే.

మాలతి వివాహం జరిగినప్పటినుంచి వర్ధనమ్మ కూతురు దగ్గరి నుంచి కొద్దో గొప్పో సహాయం పొందుతూనే ఉంది.కాని ఎప్పటికప్పుడు పరగడుపే. ఎంత చేసినా చేసిన సహాయాన్ని ఇట్టేమర్చిపోయి మరింత సాయం చేయలేదని నిష్ఠూరాలు ఆడే మనిషిని ఏమనాలి? మాలతి ఏమీ అనలేకపోతోంది, ఆమె తన తల్లి కాబట్టి.

ఏళ్ళు గడుస్తున్నా సంతానం కలగనందుకు మాలతి మనసులో బాధపడుతుండేది. అతను డాక్టర్ల దగ్గరకు తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తుండేవాడు. వివాహం అయిన కూతురు ఏడాది తిరిగేటప్పటికే బిడ్డను ఎత్తుకోవాలని ప్రతి తల్లీ ఆశిస్తుంది, ఆశపడుతుంది. కానీ వర్ధనమ్మ విషయం వేరు.

"పిల్లలు లేరని దిగులుపడటం ఎందుకే? నానిగాడ్ని పట్టుకెళ్లి పెంచుకో... లేకపోతే చివరి పిల్లను తీసుకెళ్ళు..." అంటూ మాటిమాటికీ గుర్తు చేస్తుండేది.

మాలతి ఆశలు వేరు. భర్త తెలివిగలవాడు. ఎంతో మంచివాడు. అందమైనవాడు. ఈ లక్షణాలన్నీ గల పిల్లవాడే తనకు కావాలిగానీ, తిండీ తిప్పలూ లేక ఈసురోమంటూ ఉండే పిల్లలు – వాళ్ళు తన తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ అయినా సరే – తనకు అక్కర్లేదని మాలతి ఎన్నడో నిర్ణయించుకుంది.

"నీకేమంత వయసు మించిపోయిందని?" అని అనేవాడు వాసుదేవరావు.

కానీ ఇప్పుడింక నిజంగానే వయసుమించి పోతోంది. తనకు పిల్లలు కలిగే యోగ్యత లేదు. ఎంతకాలం బతికి బట్టకడుతుందో కూడా తెలియదు.

మాలతి అత్తామామ వచ్చి ఒక వారం రోజులు ఉండి వెళ్ళారు. కొడుకును విడిగా పిల్చి ఎంతగానో నూరిపోశారు.

"కావాలని చేసుకున్నావు, నీ ఇష్టానికి వ్యతిరేకంగా మేం నడుచుకోలేక సరేనని ఒప్పుకున్నాం. పెట్టుపోతలను మేం ఏనాడూ ఆశించకపోయినా, ఒక వంశోద్ధారకుడ్ని అయినా అందిస్తారని ఆశపడ్డాం. ఇప్పుడా పరిస్థితి లేదు. సరేమరి, అయిందేదో అయిపోయింది. ఇప్పుడైనా దాన్ని వదిలేసి ఇంకోపెళ్లి చేసుకోరా వాసూ... మేం అన్నీ ఆలోచించే ఈ మాట చెబుతున్నాం..." అన్నాడు తండ్రి కొడుక్కి నచ్చచెప్పే ప్రయత్నంలో...

"అమ్మకు డయాబెటిస్ ఉంది. కీళ్ళనొప్పులున్నాయి. మీరు పెళ్ళి చేసుకున్నప్పుడు సన్నగా చలాకీగా చురుకుగా ఉండేది. ఇప్పుడు లావుగా పిప్పళ్ల బస్తాలా ఉంది. అందుచేత మీరు అమ్మను వదిలేసి మరోపెళ్లి చేసుకోండి నాన్నగారూ.. మిమ్మల్ని ఆదర్శంగా పెట్టుకుని నేనూ ఇంకో పెళ్ళి చేసుకుంటాను..." అన్నాడు వాసుదేవరావు.

తల్లిదండ్రులు అవాక్కు అయిపోయారు. అతని తల్లి ముందుగా తేరుకుని అసలు విషయానికొచ్చింది. "నీకు సంతానం కలిగితే చూసి ఆనందించాలని మా కోరిక. మన వంశం ఇంతటితో ఆఖరుకాకూడదు..." అని గుర్తు చేసింది.

అతని తల్లిదండ్రులు ఎన్నో విధాల చెప్పి చూశారు. వంశవృక్షం బీజం, క్షేత్రం అంటూ అతనికి కలిగిన బిడ్డనే చూడాలని ఉందని చెవిలో ఇల్లు కట్టుకుని పోరారు.

వాళ్ళ వాద ప్రతివాదాలన్నీ మాలతి విన్నది. "మిమ్మల్ని ఇంకో పెళ్ళి చేసుకోమని చెప్పలేను, చేసుకోవద్దనీ చెప్పలేను" అంటూ భర్త కౌగిట్లో ఇమిడిపోయి ఏడ్చేసింది.

"నాకెవరూ ఏమీ చెప్పవద్దు. ఎప్పుడేం చేయాలో నాకు అన్నీ తెల్సు.." అన్నాడు వాసుదేవరావు.

అనాథ శరణాలయానికి భార్యను తీసుకెళ్ళాడు. ఎవరో ఒక అభాగ్యురాలు కని వదిలేసి వెళ్ళిన నెల రోజుల పసిగుడ్డును దత్తత తెచ్చుకున్నారు. వాడికి ఆనంద్ అన్న నామకరణమూ చేశారు.

వాసుదేవరావు చేసిన పని అతని తల్లిదండ్రులకు ఏ మాత్రం నచ్చలేదు. "మేం కోరుకున్నది వంశోద్ధారకుడిని గానీ దిక్కుమాలిన అనాథ బిడ్డను కాదు..." అని అతని తండ్రి కార్డు ముక్క రాసి పడేసి ఊరుకున్నాడు.

"ఏ పాపిష్టిముండో కనిపారేసిన బిడ్డను తెచ్చి పెంచుకోవాల్సిన ఖర్మ నీకేం పట్టిందే? నువు పెంపకం తీసుకోదల్చుకుంటే పిల్లలే కరువైనారా? నీకడగొట్టు తమ్ముడ్నో చెల్లినో పెంచుకుంటే ఎంత బావుండేది? రక్త సంబంధం కల్సి ఉండేది గదా..." అని వర్ధనమ్మ మూతీముక్కు విరుచుకుంటూ చెప్పింది.

మాలతి తల్లిమాటలు వినిపించుకోలేదు. పిల్లవాడ్ని తెచ్చుకున్నప్పటి నుంచీ ఆమెకు మళ్ళీ కొత్త జీవితం మొదలైంది. ఆనంద్‌కు నీళ్ళు పోసి, పాలు పట్టి లాలసోసి, నిద్రపుచ్చీ తల్లిపాత్రను నిర్వహిస్తోంది. లేత చేతులూ కాళ్ళూ పైకెత్తి ఆడుకుంటూ కాసేపు ఏడుస్తూ కాసేపు బోసినోరు విప్పి నవ్వుతూ రాత్రీ పగలూ అన్న తేడా లేకుండా ఆమెను తన చుట్టూ తిప్పుకుంటూ తన సేవలోనే నిమగ్నం చేసుకుంటున్నాడు వాడు.

మాలతి వాడ్ని ఎత్తుకుని భుజాల మీద వేసుకొని తిరుగుతూ, అంతులేని ఆనందాన్ని భుజాల మీద ఎత్తుకొని మోస్తోంది. పిల్లవాడికి సేవ చేయటంలో పడిపోయి ఆమె మిగిలినవన్నీ మర్చిపోయింది. ఇప్పుడు భర్త గురించి అంతగా పట్టించుకోవటం లేదు.

"వీడు ఏడుస్తున్నాడు మీ బట్టలు బీరువాలో ఉన్నాయి తీసుకోండి... నేను వీడ్ని నిద్రపుచ్చాలి. టేబుల్ మీద కంచంలో అన్నీ వడ్డించి పెట్టాను. మీరు వెళ్ళి భోంచేయండి...." అంటూ భర్త పనుల కన్నా ఆనంద్ సేవలకే ప్రాముఖ్యం ఇస్తోంది. అర్ధరాత్రికల్లా నిద్రమానుకుని వాడు ఏడ్చినప్పుడల్లా లేచి వాడ్ని ఎత్తుకుని తిప్పుతోంది.

భార్య ఇంత ఆనందంగా ఉండటం ఇంతకుముందెన్నడూ చూడలేదు. బిడ్డను పెంచటంలో తల్లి తృప్తినీ, సంతోషాన్నీ పొందుతూ సర్వస్వాన్ని మర్చిపోగలదన్న సత్యాన్ని వాసుదేవరావు గుర్తించాడు.

క్యాన్సర్ వ్యాధి నయం చేయడంలో నిపుణుడైన డాక్టర్ ఒకరు అమెరికా నుంచి బొంబే వస్తున్నాడని తెల్సి నెలరోజుల ముందే ఆయన దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకున్నాడు వాసుదేవరావు.

అవసరమైతే మాలతిని ఆస్పత్రిలో అడ్మిట్ చేయాల్సి ఉంటుంది. అందుచేత పసివాడ్ని తమతో తీసుకెళ్ళేందుకు వీల్లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వర్ధనమ్మను పిలిపించి తమ ఇంట్లో ఉంచి పిల్లాడి ఆలనా పాలనా చూసే బాధ్యత ఆమెకు అప్పగించి వెళ్ళారు.

వర్ధనమ్మకు ఈ బిడ్డను చూస్తేనే ఒంటి నిండా తేళ్ళూ, జెర్రులూ పాకినట్లుగా ఉంటోంది. ఆకలేసి గుక్కపెట్టి ఏడుస్తున్నా పట్టించుకునేది కాదు." ఏ దిక్కుమాలిన ముండో కనిపారేసిన సంతానాన్ని తెచ్చి నెత్తిమీద పెట్టుకున్నారు. నా మెదడుకు చుట్టుకుంది దిక్కుమాలిన పీడ" అని విసుక్కునేది.

ఆనంద్‌ను చూసే బాధ్యత తన పిల్లలకే అప్పగించి ఊరుకుంది. తడిగుడ్డలు కూడా మార్చకుండా పట్టించుకోకుండా వదిలేసినందువల్ల వాడికి జ్వరం వచ్చింది. పాలు సరిగ్గా కలపనందువల్ల బాటిల్ క్లీన్ చేయనందువల్ల విరేచనాలూ, వాంతులూ మొదలైనాయి. అప్పుడూ వర్ధనమ్మ పట్టించుకోలేదు. కనీసం డాక్టర్ని పిలిపించలేదు. ఏడ్చి సొమ్మసిల్లిన ఆనంద్ ప్రాణాలు పంచభూతాల్లో కల్సిపోయాయి. ఆ విషయం కూడా వర్ధనమ్మ పట్టించుకోలేదు.

మాలతి వస్తూనే ఆనంద్ దగ్గరకు పరుగెత్తింది. ఆ ఇంట్లోకి ఎనలేని ఆనంద కోలాహాన్ని మోసుకొచ్చిన పసివాడు, బిగుసుకుపోయి కట్టెగా మారాడు. అప్పుడు రెండు చేతులూ గుండెలమీద చేర్చుకుని ఈ దిక్కుమాలినవాడికి ఈ కొద్దిరోజులూ సేవ చేసిన మాతృదేవతకు నమస్కారం చేస్తున్నట్లుగా ఉన్నాడు ఆనంద్.

గుండెల్లో గునపాలు గుచ్చినందుకు ఆగ్రహావేశాలతో తన మాతృమూర్తి వంకచూసింది మాలతి. ఆమె కళ్ళ నుంచి కురిసే నిప్పులకు పచ్చని సంసారాలు సైతం భగ్గున మండిపోతాయి.

★★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.